క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్‌లు అలరించాయి. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్ రావు, దుప్పల వెంకటరావు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టరేట్ పనుల పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.116.5 కోట్లతో పనులను ప్రారంభించగా.. సుమారు 95 శాతం పనులు పూర్తయ్యాయి. 2024 ఏప్రిల్‌లో ప్రారంభానికి సిద్ధమయ్యారు. ఎన్నికల సమయంలో కింద ఉన్న హాల్‌ను కంట్రోల్ రూమ్‌గా ఉపయోగించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ప్రారంభోత్సవం జరగలేదు. అప్పటికే ఫ్లోరింగ్, లోపల రంగులు, సీలింగ్ పనుల పూర్తి చేశారు. ప్రస్తుతం తుది దశ పనులు జరగుతున్నాయి. శుక్రవారం జిల్లాకు వచ్చిన చంద్రబాబు నిర్మాణ పనులపై ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరావు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ నుంచి ఉమెన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్మిస్తున్న సిమ్మెంట్ రోడ్డు పనులను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి శుక్రవారం ప్రారంభించారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీపాన హరిహరరావు, ఏవో పీవీఎస్ రామ్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కిలారి నారాయణరావు, నాయకులు నేతింటి సత్యనారాయణ, సీపాన దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అంతరాయం



తమ్మినాయుడుపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎచ్చెర్ల క్యాంపస్: పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభంలో సర్వర్ మొరాయించారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు సర్వర్ల సమస్యతో పింఛన్ల పంపిణీ సక్రమంగా ముందుకు సాగలేదు. ఎచ్చెర్ల మండలంలో మొదటి రోజులు 95 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు తెలిపారు. మిగిలిన వారికి శనివారం అందజేస్తామని చెప్పారు. కాగా, తమ్మినాయుడుపేటలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు అందరూ సహకరించాలని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం సచివాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. కాలువలు, రోడ్డు పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, నాయకులు బత్తుల సన్యాసిరావు, చందనాల రంగారావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, కార్యదర్శి హిమబిందు, టీఏ లక్ష్మణరావు, ఎఫ్ ఏ వాండ్రంగి రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

మురపాకలో జంగిల్ క్లియరెన్స్

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు పర్యవేక్షించారు.

మౌలిక వసతులకు మోక్షమెప్పుడో?



కాలనీ మధ్యలో పారుతున్న మురుగునీరు

- కాలనీల్లో సమస్యల తిష్ట
- రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు అర్బన్ లేఅవుట్ వాకలవలసలో వెలసిన ఎన్టీఆర్ నగర్(జగనన్న కాలనీ)లో సమస్యలు తిష్టవేశాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కాలనీలో మొత్తం 1,733 ప్లాట్లు ఏర్పాటు చేయగా, అందులో వివిధ దశల్లో 1,150 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాలు కల్పించే తరుణంలో ప్రభుత్వం మారడంతో తర్వాత వచ్చిన పాలకులు ఇక్కడి సమస్యలను గాలికొదిలేశారు. ప్రస్తుతం ఈ కాలనీలో వంద కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఎటువంటి అభివృద్ధి పనులను ప్రస్తుతం అధికారులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అధికారులు మౌలిక సదుపాయాల ఊసెత్తడం లేదు.

ముందుకు సాగని పనులు..

ఈ కాలనీని జిల్లా యంత్రాంగం, అధికారులు ప్రతీసారి వచ్చి చూడడమే తప్ప, అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ప్రధానంగా డ్రైనేజీలు, రోడ్లు బాగు చేయాలని స్థానికంగా నివాసం ఉన్న కాలనీ ప్రజలు వచ్చిన అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ఇటీవల కాలంలో జాయింట్ కలెక్టర్, హౌసింగ్ ఏడీ, స్థానిక ఎమ్మెల్యే పలు దఫాలుగా కాలనీకి వచ్చారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా మోక్షం కలగడం లేదు. దీంతో గృహ ప్రవేశాలు చేసిన వారు సైతం ఒకటి రెండు రోజులు ఇంట్లో ఉంటూ, మరలా ఇదివరకు ఉన్నటువంటి ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.



కానరాని డ్రైనేజీ వ్యవస్థ

రోడ్లు వేయాలి..



ఎన్టీఆర్ నగర్ (జగనన్న కాలనీ)లో రోడ్లు, డ్రైనేజీలు వేస్తే మరిన్ని కుటుంబాలు నివాసం ఉంటాయి. ప్రతీ ఒక్కరూ ఇళ్ల నిర్మాణం చేసి మూడు రోజులు ఉండటమే తప్ప నాలుగో రోజు నుంచి ఉండటానికి ఎవ్వరూ సాహసించడం లేదు. ఉన్నవారు సైతం వీధికి ఒకటో రెండో కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

– శ్రీనివాసరావు, కాంట్రాక్టర్

సదుపాయాలు కల్పించాలి



ఇటీవలే ఇంటి నిర్మాణం పూర్తి చేశాను. కాలనీలో నివాసం ఉండడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. విద్యుత్ సౌకర్యం తప్ప మురికినీరు పోవడానికి డ్రైనేజీ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– శంకరావు, వాకలవలస

ప్రతిపాదనలు పెట్టాలి

రాగోలు అర్బన్ లే అవుట్‌కు సంబంధించి రోడ్లు, డ్రైనేజీలు నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టాం. కేవలం సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం సంబంధించి సుమారు రూ.10 కోట్లకు ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం.

– సత్యజీ, హౌసింగ్ ఏఈ

వెల్లివిరిసిన దీపకాంతులు



శ్రీకాకుళం కల్చరల్: దీపాల అలంకరణలో బలగలోని కాలభైరవాలయం

దీపకాంతులు వెల్లివిరిశాయి. దీపావళి పండగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఇంటి ఆవరణలో దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు బాణసంచా కాల్చుతూ సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జి.సిగడాం: సీతంపేట పాఠశాలలో దీపావళి వేడుకలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో ముగ్గుపై దీపాలు వెలిగించిన విద్యార్థులు



జి.సిగడాం: దీపాల వెలుగులో పెంట ప్రాథమికోన్నత పాఠశాల

● ఆగని సముద్ర ఇసుక దందా



రణస్థలం మండలంలోని కొచ్చెర్ల, ఎస్.జి.ఆర్.పురం, దొనిపేట తదితర ప్రాంతాల్లో సముద్ర ఇసుక దందా ఇంకా కొనసాగుతునే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి నాలుగు నెలలు ఇసుక విధానంలో స్పష్టత లేక కొరత ఏర్పడటంతో సముద్రపు దిబ్బ ఇసుక, గెడ్డ ఇసుక కలిపి విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తరలించేవారు. ఇప్పుడూ ఈ అక్రమ రవాణా ఆగడం లేదు. భవన నిర్మాణాలకు ఉపయోగపడని సముద్ర ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-రణస్థలం

● ద్రవ జీవామృతమే కీలకం



ఎచ్చెర్ల మండలం జరజాం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రిసోర్సుపర్సన్లు శుక్రవారం ద్రవ జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ ద్రావణంతో సాగు చేస్తే కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం బెల్లం, సెనగ పిండి, ఆవు మూత్రం, పేడ, నీళ్లు, పుట్ట మట్టిలతో 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు. రిసోర్సు పర్సన్లు మెట్ట ధనుంజయ, హరేరామ్ పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

● ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



బలగ నుంచి సిద్ధిపేట వెళ్లే దారిలో పాత అమ్మ ఫౌండేషన్‌కు వెళ్లే రహదారిలో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి వెంబడి వస్తున్న వాహనాలు సైతం ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. పొరపాటున హారన్ కొట్టకపోతే ఎదురెదురుగా వస్తున్న వాహనాలు సైతం ఢీకొట్టి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

- శ్రీకాకుళం రూరల్

● బాబోయ్ కుక్కలు



గ్రామాల్లో కుక్కల సంచారం ఎక్కువైంది. గుంపులుగా తిరుగుతూ దాడులకు ఎగబడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్కకాటుకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇక వాహనచోదకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. బండి వెనుకే వెంబడిస్తుండటంతో ఒక్కోసారి అదుపుతప్పి బోల్తాపడుతున్నారు. బాతువ గ్రామంలో కుక్కల స్వైర విహారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జి.సిగడాం

ప్రముఖులకు నివాళులు



శ్రీకాకుళం న్యూకాలనీ:రన్ ఫర్ యూనిటీ ర్యాలీలో వివిధ శాఖల అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు

ప్రజాసేవకు జీవితం అంకితం చేసిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి.. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ ఐక్య ప్రదాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి..భారత మాజీ ప్రధానిమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాలను గురు,శుక్రవారాల్లో నిర్వహించారు. ఆయా నాయకుల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం అర్బన్: ఇందిరావిజ్ఞానభవన్‌లో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రతినిధులు



శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: నివాళులర్పిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్రస్మృతి పరిరక్షణ సమితి ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలో పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి



ఎచ్చెర్ల: అదపాకలో పొట్టి శ్రీరాములుకు జోహార్లు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఏక్తాదివస్ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు



జి.సిగడాం: ధవళపేటలో అమరజీవి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లక్ష్మీదేవి నమోస్తుతే..!



కోదండ రామాలయంలో మహాలక్ష్మి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపావళి పురస్కరించుకుని అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. నానుబాలవీధిలో విజయ దుర్గ అమ్మవారిని గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పీఎన్ కాలని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో అష్ట లక్ష్మీ ఆలయంలో అష్ట లక్ష్మీదేవతలకు అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు.



గాజుల అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

ఉమాజఠలేశ్వరునికి కార్తీక శోభ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ అలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు.



విద్యుత్ అలంకరణలో ఆలయం

3న పసుమర్తి శతజయంతి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సామాజికవేత్త, ఉద్యమకారుడు పసుమర్తి రామారావు శత జయంతి ఉత్సవాలను ఈ నెల 3న ఉదయం 10 గంటలకు డే అండ్ నైట్ వద్ద గల బ్లూఎర్త్ హోటల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పసుమర్తి రామ్‌మనోహర్, రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నేత్ర వైద్య నిపుణుడు ఎం.వి.రమణారావు, కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, జంధ్యాల శరత్‌బాబు, వి.జి.కె.మూర్తి తదితరులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అభిమానులు హాజరుకావాలని కోరారు.

తుప్పలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

జి.సిగడాం: మండలంలోని ఎస్పీఆర్‌పురంలో చెత్త సంపద కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో 'గాలికొదిలేశారు' శీర్షికను గత నెల 27న కథనం ప్రచురితమైంది. దీనిపై సర్పంచ్ కంది రమాదేవి, పంచాయతీ కార్యదర్శి లుకలాపు ఉషారాణి స్పందించి శుక్రవారం పిచ్చిమొక్కలను తొలగించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు.



చెత్త సంపద కేంద్రం పరిసరాలను శుభ్రం చేసిన దృశ్యం

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: నడక ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరాప్రసాద్ అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆళ్వార్ దాస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన మీనా మసీదు ఇమామ్ ఎండీ జలాలుద్దీన్ కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బి.వి.రవిశంకర్‌స్టార్, క్లబ్ కో–ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



ఆళ్వార్‌దాస్ జయంతి వేడుకల్లో క్లబ్ ప్రతినిధులు

గుండను పట్టించుకోని బాబు

శ్రీకాకుళం: జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం మాజీ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణను కనీసం ఫోన్‌లో గానీ, నేరుగా గాని పరామర్శించకపోవడం చర్చనీయాంశమైంది. అప్పలసూర్యనారాయణ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. సున్నిత మనస్కుడైన అప్పలసూర్యనారాయణ నగర పార్టీ వాట్సాప్ గ్రూపు నుంచి ఆయనను, ఆయన సతీమణి లక్ష్మీదేవిని తొలగించడం వల్లే మనస్థాపం చెంది అస్వస్థతకు గురైనట్టు పార్టీ వర్గాలే బహిరంగంగా చెబుతున్నాయి. పార్టీకి ఇంతటి సేవ చేసిన నాయకులను విస్మరించిన చంద్రబాబు.. తమ వంటివారిని ఏం గుర్తిస్తారని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ గుండ దంపతులు మాత్రం శుక్రవారం పార్టీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవడం కొసమెరుపు.